# వరంగల్ వాయిస్

www.warangalvoice.net
Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 44
మంగళవారం | 08 ఆగస్టు 2023 | పేజీలు : 08 | వెల రూ. 5




## గృహలక్ష్మికి మూడు రోజులే..

ఆశావాహుల్లో అయోమయం

గడువు పెంచాలంటూ వినతులు

8లో



2లో..

# కాంగ్రెస్ గాలం..

- గెలుపు గుర్రాలపై నజర్
- నియోజకవరాల వారీగా సర్వే
- ఇప్పటికే పలువురితో మంతనాలు
- గెలుపే లక్ష్యంగా అడుగులు

కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. కర్ణాటక ఫార్ములాను తెలంగాణలో కూడా అమలుచేసి అధికారాన్ని హస్తగతం చేసుకునేందుకు పథకాలు రచిస్తోంది. ఇంతకాలం పార్టీకోసం కాకుండా కేవలం తమ ఉనికి కోసమే పాకులాడే వారిని పక్కనబెట్టేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధపడుతోంది. పాత తరాన్ని పక్కనబెట్టి గెలుపు గుర్రాలపై ఫోకస్ పెడుతోంది. అలాంటి వారు ఏ పార్టీలో ఉన్నా వారికి గాలం వేస్తోంది. నియోజకవర్గాల వారీగా సర్వేలు నిర్వహిస్తూ అధికార పార్టీకి ముచ్చెమటలు పట్టిస్తున్నారు. కొత్త తరంకోసం వివిధ నియోజకవర్గాల్లో ఇప్పటికే పలువురితో మంతనాలు జరిపినట్లు సమాచారం. అయితే త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో వృద్ధ నాయకులకు కాకుండా అధిక స్థానాల్లో కొత్త ముఖాలను పరిచయం చేసేందుకు అధిష్ఠానం వ్యూహాలు రచిస్తోంది. - వరంగల్ వాయిస్, వరంగల్

## సబ్సిడీ గొర్రెలు మాయం

పంపిణీ జరిగిన 12 గంటలోపే తిరిగి విక్రయం

పక్కదారి పడుతున్న ప్రభుత్వ పథకాలు



2లో



2లో

## నకిలీ, గడువు తీరిన పురుగు మందుల విక్రయం

- పోలీసుల అదుపులో 13మంది కేటుగాళ్లు
- రూ.57లక్షల విలువ చేసే రసాయనాల స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ రంగనాథ్

# కాంగ్రెస్ గాలం..



**గెలుపు గుర్రాలపై నజర్**
**నియోజకవర్గాల వారీగా సర్వే**
**ఇప్పటికే పలువురితో మంతనాలు**
**గెలుపే లక్ష్యంగా అడుగులు**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఒకప్పుడు ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీకి కంచుకోట. దేశం మొత్తం ఇతర పార్టీల హవా నడుస్తున్నా వరంగల్ ప్రజలు మాత్రం కాంగ్రెస్ పార్టీని వీడలేదు. కష్ట సమయాల్లో కూడా కాంగ్రెస్ పార్టీని అక్కున చేర్చుకున్నది వరంగల్ జిల్లా ఓటర్లే. కాంగ్రెస్ పార్టీకి ఇక్కడ ప్రత్యేక ఓటు బ్యాంకు ఉంది. అయితే ప్రత్యేక తెలంగాణ ఉద్యమంతో ఆ సీన్ రివర్స్ అయింది. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత ఉద్యమ పార్టీ అయిన బీఆర్ ఎస్ కు తెలంగాణ ప్రజలు అండగా నిలిచారు. అదే బాటలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఓటర్లు కూడా బీఆర్ ఎస్ కు పట్టం కట్టారు. కేవలం ఒక్క ములుగు సెగ్మెంట్ మినహా మిగిలిన 11 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమి పాలైంది.

### దూకుడు పెంచిన కాంగ్రెస్..

తెలంగాణ ఇచ్చిన పార్టీగా అధికారం చేజిక్కించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ వేగంగా పావులు కదుపుతోంది. కర్ణాటక విజయంతో తెలంగాణలో దూకుడు పెంచింది. ఇతర పార్టీల నేతలను పార్టీలో చేర్చుకుంటుంది. ఇప్పటికే మాజీ ఎంపీ పొంగిలేటి సహా కీలక నేతలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోగా.. మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు సహా పలువురు నేతలు కాంగ్రెస్ గూటికి చేరనున్నారు. ఇదే దూకుడుతో సమీకరణాలు, వ్యూహాలు మాత్రమే కాకుండా అభ్యర్థుల ఎంపికను కూడా కాంగ్రెస్ వేగవంతం చేసింది. వైఎస్సార్ టీపీని కూడా కాంగ్రెస్ పార్టీలో విలీనం చేయనున్నట్లు ప్రచారం సాగుతోంది. ఆ పార్టీ అధ్యక్షురాలు కాంగ్రెస్ లో చేరడం ద్వారా మరింత బలం చేకూరుతుందని భావిస్తున్నారు.

### గెలుపు గుర్రాలపై నజర్..

గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ప్రత్యేక చొరవ చూపుతోంది. అభ్యర్థుల ఎంపికలో ఒంటరి నిర్ణయాలు కాకుండా ప్రజల్లో పలుకుబడి కలిగిన వారికే టికెట్ ఇచ్చేలా పథకం రూపొందిస్తున్నారు. అభ్యర్థుల పేర్లను గతంలో మాదిరిగా కాకుండా ముందుగానే ప్రకటించడం ద్వారా ప్రచారానికి ఎక్కువ సమయం లభిస్తుందని భావిస్తున్నారు. అయితే గెలుపు గుర్రాలపైనే ఆ పార్టీ నజర్ పెట్టినట్లు పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇప్పటికే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేసినట్లు ప్రకటిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 80మందితో ఆగస్టు చివరి నాటికే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటిస్తామంటూ ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జి మాణిక్ రావ్ ఠాక్రే ఇప్పటికే ప్రకటించారు. అయితే ఏకాభిప్రాయం కుదిరిన నియోజకవర్గాల్లోని అభ్యర్థుల పేర్లను మాత్రమే ప్రకటిస్తామంటున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఆరు నుంచి ఎనిమిది సెగ్మెంట్ లలో పోటీ చేసే అభ్యర్థుల పేర్లు తొలి జాబితాలో ఉండనున్నట్లు ప్రచారం సాగుతోంది.

### 35 స్థానాల్లో వీక్..

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ 35 స్థానాల్లో బాగా వీక్ గా ఉందని ఆ పార్టీ ప్రచార వ్యూహకర్త సునీల్ కనుగోలు తేల్చి చెప్పారు. ఆయా స్థానాలున్న ఐదు లోక్ సభ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ గెలుపు కష్టం అని వివరించారు. తక్షణమే బలమైన అభ్యర్థులను గుర్తించి వారిని ప్రచార బరిలో దింపాలని, పార్టీని పటిష్టం చేయాలని నాయకులకు సూచించారు. అయితే తెలంగాణ కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో కూడా ఈ విషయాలు ప్రస్తావనకు తెచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధిస్తేనే పార్లమెంటు ఎన్నికల్లో కూడా అదే ఒరవడి కొనసాగుతుందని ఆ పార్టీ పెద్దలు భావిస్తున్నారు. అప్పుడు రాష్ట్రంలో, దేశంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశం ఉంటుందంటున్నారు.

### ఉమ్మడి వరంగల్ జిల్లాలో..

కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నేతలంతా టికెట్ల వేటలో పడ్డారు. ఎవరు ఎన్ని చెప్పినా టికెట్ నాకే అన్న ధీమాతో ఉన్నారు. వచ్చే ఎన్నికలలో వరంగల్ తూర్పు నియోజకవర్గంపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరటం ఖాయమని ఇప్పటికే కొండ మురళి స్పష్టం చేశారు. ఒక్క వరంగల్ తూర్పు నియోజకవర్గం మాత్రమే కాకుండా ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉంటామంటూ ఆయన ప్రకటిస్తున్నారు. అయితే వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణను నియమించడంతో తూర్పులో రెండు వర్గాలుగా విడిపోయారు. ఇదే పరిస్థితి ఉమ్మడి జిల్లాలోని చాలా నియోజకవర్గాల్లో నెలకొంది. అయితే ములుగు నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే ధనసరి అనసూర్య (సీతక్క), భూపాలపల్లి నియోజకవర్గంలో గండ్ర సత్యనారాయణ, నర్సంపేట నియోజకవర్గంలో దొంతి మాధవరెడ్డి, పరకాల నియోజకర్గంలో ఇనుగాల వెంకట్రాం రెడ్డి పేర్లు ఖరారైనట్లు సమాచారం. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కొండా సురేఖ, ఎర్రబెల్లి స్వర్ణతోపాటు నర్సంపేటకు చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు వెంకటస్వామి గౌడ్ సైతం పోటీ పడుతున్నారు. అదే విధంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో నాయిని రాజేందర్ రెడ్డి, జంగా రాఘవరెడ్డితోపాటు వేం నరేందర్ రెడ్డి సైతం టికెట్ పై ఆశలు పెట్టుకున్నారు. జనగామ నియోజకవర్గంలో పొన్నాల లక్ష్మయ్య, కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, పాలకుర్తి నియోజకవర్గంలో అనుమాండ్ల జాన్సీరెడ్డి, రామసహాయం రఘురాం రెడ్డి, డోర్నకల్ నియోజకవర్గంలో మాలోతు రాంచంద్రనాయక్, మహబూబాబాద్ నియోజకవర్గంలో పోరిక బలరాం నాయక్, మురళి నాయక్, వర్దన్నపేట నియోజకవర్గంలో జన్ను పరంజ్యోతి, రిటైర్డ్ ఐపీఎస్ ఆఫీసర్ నాగరాజు పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. అయితే స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గంలో ఇందిరా సింగాపురంతోపాటు బీఆర్ ఎస్ ఎమ్మెల్సీ కడియం శ్రీహరి పేర్లు వినిపిస్తున్నాయి. అక్కడి ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యతో శ్రీహరికి గతకొంత కాలంగా వైరం కొనసాగుతోంది. పార్టీ మారైనా రాజయ్యను ఓడించాలన్న పన్నాగంలో శ్రీహరి ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. అదే విధంగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కూడా ఒక బలమైన క్యాండిడేట్ ను నిలిపేందుకు కాంగ్రెస్ పార్టీ నేతలు పావులు కదుపుతున్నట్లు సమాచారం. అయితే వ్యాపారులతో దగ్గరి సంబంధం కలిగిన వ్యక్తిని తెరమీదికి తెచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ పెద్దలు వ్యూహ రచన చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఆయనతో కాంగ్రెస్ పెద్దలు పలుమార్లు మంతనాలు జరిపినట్లు ప్రచారం సాగుతోంది.

# నకిలీ, గడువు తీరిన పురుగు మందుల విక్రయం

**పోలీసుల అదుపులో 13మంది కేటుగాళ్లు**
**రూ.57లక్షల విలువ చేసే రసాయనాల స్వాధీనం**
**వివరాలు వెల్లడించిన సీపీ రంగనాథ్**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** దేశానికి అన్నంపెట్టే రైతన్నను దగా చేస్తూ నకిలీతో పాటు గడువు తీరిన పురుగు మందులను విక్రయిస్తున్న మూడు ముఠాల్లోని 11 మంది సభ్యులతో పాటు ప్రభుత్వ నిషేధిత గడ్డి మందు విక్రయిస్తున్న మరో ఇద్దరిని టాస్క్ ఫోర్స్ పోలీసులు, గీసుగొండ, నర్సంపేట, ఐనవోలు సివిల్ పోలీసులు సంయుక్తంగా కలిసి అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.57 లక్షల విలువచేసే నకిలీ, గడువు తీరిన పురుగుల మందులు, నిషేధిత గడ్డి మందుతోపాటు నాసిరకం పురుగు మందుల తయారీకి అవసరమైన రసయానాలు, ప్రింటింగ్ సామగ్రి, ఖాళీ బాటిల్స్, రవాణాకు వినియోగించే ఒక కారు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో రూ.24 లక్షల విలువైన గడువు తీరిన పురుగు మందులు, రూ.30 లక్షల విలువైన నకిలీ పురుగు మందులు, రూ.3.53లక్షల విలువగల ప్రభుత్వ నిషేదిత గడ్డి మందు ఉన్నట్లు సీపీ రంగనాథ్ వెల్లడించారు. వరంగల్ జిల్లా గీసుగొండ మండలం దస్ప తండా కు చెందిన సునఫత్ వీరన్న, నల్లబెల్లి మండలం నందిగామకు చెందిన ఇస్లావత్ వెంకటేష్, కరీంనగర్ జిల్లా శ్రీనగర్ కాలనీ చెందిన ఏల సదాశివ రెడ్డి, ములుగుజిల్లా రామచంద్రపూర్ కు చెందిన ఈజిగిరి రాజు, మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రానికి చెందిన ఎడ్ల ఏలంధర్ రెడ్డి గడువు తీరిన పురుగు మందులు విక్రయిస్తుండగా వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లికి చెందిన హనుమాండ్ల భాస్కర్, నర్సంపేట మండలం మహేశ్వరానికి చెందిన భూక్యా మాత్రు రాథోడ్, హైదరాబాద్ ఉప్పల్ కు చెందిన మాడితరి శేఖర్ రెడ్డి, కొత్తపేటకు చెందిన శెలగ నారాయణ, మేడ్చల్ కు చెందిన ఏదుల విష్ణు వర్ధన్ రెడ్డి, నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలానికి చెందిన వెలమ స్వపన్ కుమార్ నాసిరకం పురుగు మందులు విక్రయిస్తు పోలీసులకు చిక్రారని వెల్లడించారు. అదేవిధంగా వరంగల్ జిల్లా ఐనవోలు మండలం నందనం గ్రామానికి చెందిన బుర్ర ఎల్లగౌడ్, బోయినవల్లి శ్రీవతి రావు ఇరువురు నిషేదిత గడ్డిమందు విక్రయిస్తు పోలీసులకు చిక్కారన్నారు. రైతులను మోసం చేస్తూ నకిలీ, గడువు తీరిన పురుగు మందుల విక్రయాలకు పాల్పడుతున్న కేటుగాళ్ళను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన టాస్క్ ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీలు మధుసూదన్, జితేందర్ రెడ్డి, ఇన్ స్పెక్టర్లు శ్రీనివాస్ రావు, అల్లం రాంబాబు, బాబూలాల్, పవన్ కుమార్, పెండ్యాల దేవేందర్, ఎస్.ఐలు నరసింహరావు, వంశీకృష్ణ, శరత్ కుమార్, లవన్ కుమార్, నిస్సార్పాషా, ఏఏఓ సల్మాన్పషా, టాస్క్ ఫోర్స్ హెడ్ కానిస్టేబుళ్ళు అశోక్, స్వర్ణలత, కానిస్టేబుళ్ళు, శ్రీనివాస్, ప్రభాకర్, దయాసాగర్, అబ్దుల్లా, రాజేష్, కిరణ్, భిక్షపతి, రాజు, శ్యాంసుందర్, సురేష్, మహబూబాషా, కరుణాకర్, శ్రీధర్, సతీష్, రమేష్, నరేష్, నవీన్ కుమార్, శ్రీనివాస్, గౌతం, శ్రావణ్ కుమార్, నాగరాజులను పోలీస్ కమిషనర్ అభినందించారు. ఈ మీడియా సమావేశంలో ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్, నర్సంపేట ఏసీపీ తిరుమల్ పాల్గొన్నారు.



# సబ్సిడీ గొర్రెలు మాయం

**పంపిణీ జరిగిన 12 గంటలోపే తిరిగి విక్రయం**
**పక్కదారి పడుతున్న ప్రభుత్వ పథకాలు**

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** సబ్సిడీ గొర్రెలు మాయమవుతున్నాయి. పంపిణీ చేసిన కొన్ని గంటల్లోనే ఎక్కడి నుంచి వచ్చాయో తిరిగి అక్కడికే చేరుతున్నాయి. పంపిణీ జరిగి 12 గంటలు జరుగకముందే వచ్చిన డీసీఎం వాహనంలోనే ఇతర ప్రాంతాలకు తరలి పోతున్నాయి. డోర్నకల్ మండలంలోని గొల్లచర్ల గ్రామంలో సోమవారం 12 మంది లబ్ధిదారులకు గొర్రెలను పంపిణీ చేశారు. ఒక్కొక్క లబ్ధిదారులకు 20 గొర్రెలతో పాటు ఓ పోటేలును అందజేశారు. వీటిని ఆంధ్ర రాష్ట్రంలోని పల్నాడు ప్రాంతంలోని మాచర్ల నుండి గొర్లను దిగుమతి చేసుకున్నారు. దీనికి సంబంధించిన 12 మంది లబ్ధిదారులు మాచర్ల చేరుకొని అక్కడున్న ఆరోగ్యవంతమైన గొర్రెలను తెలంగాణ పశుసంవర్ధక శాఖ అధికారుల సూచన మేరకు లబ్ధిదారులు ఎంపిక చేసి గొల్లచర్ల గ్రామానికి దిగుమతి చేసుకున్నారు. ఇదిలా ఉండగా దిగుమతి చేసుకున్న చాలా వరకు గొర్రెలను సోమవారం రాత్రి రెండు డీసీఎంల ద్వారా గ్రామం నుంచి ఇతర ప్రాంతాలకు తరలించినట్లు గ్రామంలో పుకార్లు వినిపిస్తున్నాయి. గొర్లను తమ ఇండ్లకు దిగుమతి చేసిన 12 గంటలలోపే వచ్చిన డీసీఎంలోనే ఇతర ప్రాంతాలకు పంపించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గొర్ల చేవులకు ప్రభుత్వం వేసిన ట్యాగులను కత్తిరించి దళారులకు విక్రయించినట్లు తెలుస్తోంది.

### గ్రామాలకు చేర్చేంతవరకే బాధ్యత..

సబ్సిడీ గొర్రెలు కొనుగోలు, పంపిణీకి సంబంధించి ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. పశుసంవర్ధక శాఖ అధికారులు కాకుండా వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా స్థాయి అధికారులు సబ్సిడీ గొర్రెల కొనుగోలు, రవాణా, పంపిణీని మానిటరింగ్ చేస్తారు. జిల్లా వ్యాప్తంగా ఇందుకోసం కలెక్టర్ ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లా స్థాయి అధికారుల్లో ఒక్కొక్కరూ ఒక్కో టీం లీడర్గా వ్యవహరిస్తారు. ఈ టీముల్లో మండల స్థాయిలో పంచాయతీ అధికారులు ఉంటారు. ఈ టీంలు గొర్రెలను కొనుగోలు చేసి గ్రామాలకు చేర్చడం, లబ్ధిదారులకు అందేజేసేంత వరకే బాధ్యత తీసుకుంటారు. ఆ తర్వాతే అసలు తంతు ప్రారంభమవుతుందని, తీసుకొచ్చిన డీసీఎం వాహనంలోనే దళారుల ఇంటికి చేరుతున్నట్లు ప్రచారం సాగుతోంది. వీటిపై విచారణ జరిపి సబ్సిడీ గొర్రెల పంపీణీ పథకాన్ని కాపాడాలని గొర్రెల కాపరులు కోరుతున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి ఇద్దరికి తీవ్రగాయాలు




**వరంగల్ వాయిస్, మరిపెడ :** ఓ ప్రైవేట్ అంబులెన్స్ కల్వర్టును ఢీకొట్టిన రోడ్డుప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన మరిపెడ పట్టణ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. బాధితుల బంధువులు తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని ఇస్లాపురం గ్రామానికి చెందిన గజ్జి సంపత్ హైదరాబాద్ లోని ఈఎస్ఐ ఆస్పత్రిలో అనారోగ్యంతో మృతిచెందగా, ఓ ప్రైవేట్ అంబులెన్స్ లో స్వగ్రామానికి తరలిస్తున్నారు. అయితే మరిపెడ పట్టణ శివారులోని రాగానే అంబులెన్స్ అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముందు సీట్లో కూర్చున్న బయ్యారం మండలం ఇస్లాపురం గ్రామానికి చెందిన ముద్ద సారయ్య యాదవ్ (38) అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్ శివ, గజ్జి అప్పయ్య అనే మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మరిపెడ ఎస్సై పవన్ కుమార్ ప్రమాదస్థలికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మరో అంబులెన్సులో ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బీజేపీ స్వశక్తి అభియాన్



**వరంగల్ వాయిస్, పరకాల :** బీజేపీ పరకాల పట్టణం 41వ బూత్ అధ్యక్షుడు పెండెల రామకృష్ణ ఆధ్వర్యంలో 41వ బూత్ స్వశక్తి అభియాన్ లో భాగంగా మంగళవారం నరేంద్ర మోదీ 9 ఏళ్ల పాలన, చేసిన అభివృద్ ని ప్రజలకు వివరిస్తూ బీజేపీకి ఓటు వేసి బలపరచాలని కోరారు. ఈ ఇంటింటి ప్రచారంలో శక్తి కేంద్రం ఇంచార్జ్, పరకాల పట్టణ ప్రధాన కార్యదర్శి గాజుల నిరంజన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాచం గురు ప్రసాద్, జిల్లా కార్యదర్శి ఎర్రం రామన్న, బీజేపీ జిల్లా నాయకులు మారేడుగొండ భాస్కర్ చారి, 42వ అధ్యక్షుడు దామ సతీష్, 42వ బూత్ మాజీ అధ్యక్షుడు అల్లాడి సతీష్, పరకాల నాయకులు ఆకుల శ్రీధర్, బూత్ నాయకులు పాల్గొన్నారు.

## మీ సేవ కేంద్రాల్లో గృహలక్ష్మి దరఖాస్తుల సందడి



**వరంగల్ వాయిస్, మల్హర్ :** తెలంగాణ ప్రభుత్వం తాజాగా గృహలక్ష్మి పథకం కింద ఇండ్ల మంజూరు కోసం దరఖాస్తులు ఆహ్వానించింది. దీంతో దరఖాస్తుదారులు దరకాస్తు చేసుకోవడానికి కావాల్సిన క్యాస్ట్, ఇన్ కమ్, రెసిడెన్స్ సర్టిఫికేట్ల కోసం మీసేవ కేంద్రాలకు పరుగులు తీయడంతో మీ సేవ కేంద్రాలు కిటకిటలాడుతున్నాయి. దరఖాస్తుకు ఈ నెల 10 చివరి రోజు కావడంతో ఆ సమయం లోపు దరకాస్తుకు కావాల్సిన సర్టిఫికేట్లు అందుతాయా లేదా అని దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. గృహలక్ష్మి పథకం కోసం ఆశావహులు మీ సేవ కేంద్రం నుంచి తీసుకున్న క్యాస్ట్, ఇన్ కమ్, రెసిడెన్స్ సర్టిఫికేట్లకు దరఖాస్తు ఫారం జమ చేసి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈ నెల 10లోపు అందజేయాలి. ఆధునిక డిజిటల్ యుగంలో అప్లికేషన్లు అన్ లైన్ లో కాకుండా ఆఫ్ లైన్ లో తీసుకోవడం పై దరకాస్తు దారులు పెదవి విరుస్తున్నారు. ఇది ఇలా ఉండగా గతంలో ప్రభుత్వం నుంచి ఇల్లు మంజూరు అయిన వారికి గృహలక్ష్మి పథకం వర్తించదని అధికారులు తెలిపారు. అయినప్పటికీ ఆశావహులు గతంలో ఇల్లు పొందినప్పటికీ తాజాగా గృహలక్ష్మి పథకానికి దరకాస్తు చేసుకోవడం గమనార్హం. ఈ విషయం పై అధికారులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# కుల మతాలకతీతంగా అన్ని వర్గాలను కాపాడుకుంటాం

### ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** చేనేత కార్మికులకు గుండెల్లో పెట్టుకునే చూసుకునే గొప్ప నాయకుడు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, తెలంగాణ సర్కారని ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. చేనేత మిత్ర పథకం ద్వారా ప్రతి మగ్గం కార్మికుడి నెలకు రూ.3000 ఆర్థిక సాయం అందిచడానికి నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు కొత్తవాడ జంక్షన్ లో కొత్తవాడ నేత కార్మికులతో కలసి ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేయర్ గుండు సుధారాణి హాజరయ్యారు. ఇంత గొప్ప నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్కు నేతన్నల కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేనేతలు పట్ల మరోమారు గొప్ప మనసును చాటుకొని బాసటగా నిలిచిందని ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం పలు పథకాలను రద్దుచేసి నేతన్నల జీవితాలను ఆగం చేయడానికి చూశారని, ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్, తెలంగాణ సర్కారు నేతన్నలను కడుపులో పెట్టుకొని చూసుకోవాలని గొప్ప సంకల్పంతో ఇప్పటికే నేతన్నకు బీమాను ఏర్పాటు చేశారని అన్నారు. 75 సంవత్సరాల వయసు వరకు ఇన్సూరెన్స్ వర్తిపజేయడం, రూ. 12 వేలు ఉన్న దానిని 25వేలు చేయడం, రూ.3016 పెన్షన్ అందించబోతున్న మనసు గల సర్కారని అన్నారు. కేసీఆర్, కేటీఆర్ దార్శనికతకు ఇది నిదర్శనం అని ఎమ్మెల్యే కొనియాడారు. 2015లో ఇదే నేతన్నల సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ ను పలుమార్లు కలిసి వారూ



ఉత్పత్తి చేసిన కార్పెట్స్, బెడ్ షీట్, ఖరీదు చేయించి అండగా నిలవడం జరిగిందన్నారు. 5వేల మంది ఉన్న కొత్తవాడ చేనేత కార్మికులకు, భవిష్యత్ లో వారి పిల్లలకు మెగా టెక్స్ టైల్ పార్క్ ద్వారా ఆదుకునే విధంగా చూస్తామన్నారు. అన్ని వర్గాలను కాపాడుకునే ఏకైక ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వమని ఎమ్మెల్యే నరేందర్ అన్నారు. కొత్తవాడ, కరీమాబాద్, రంగశాయిపేట, ఇతర ప్రాంతాల్లో ఉన్న నేత కార్మికులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ యేలుగం లీలావతి సత్యనారాయణ, కార్పొరేటర్ గుండేటి నరేందర్, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు అడెపు రవీందర్, కొత్తవాడ చేనేత సొసైటీల అధ్యక్షుడు పంతగాని శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు గోరంట్ల రాజు, చిప్ప వెంకటేశ్వర్లు, రవి రాజ్, బేతి అశోక్, వడ్నాల నరేందర్, ఎలగం శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు బొల్లు సతీష్, ముఖ్య నాయకులు, చేనేత సంఘాల అధ్యక్షులు, చేనేత పెద్దలు, చేనేత కార్మికులు హాజరయ్యారు.

## గృహలక్ష్మి పథకం దరఖాస్తుల స్వీకరణ

**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** ఆగస్టు నెల 10 వరకు గృహలక్ష్మి పథకం దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పర్వతగిరి ఎంపీడీఓ చక్రాల సంతోష్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సొంత ఇంటి స్థలం కలిగి ఉండి, ఇల్లు నిర్మించుకునే ఆర్థిక స్తోమత లేని వారికి ప్రభుత్వం ఇల్లు నిర్మించుకునేందుకు రూ.3లక్షల ఆర్థిక సహాయం అందించేందుకు గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని, పథకం అమలుకు మార్గదర్శకాలను జారీ చేసిందని తెలిపారు. జిల్లాలోని 3అసెంబ్లీ నియోజకవర్గాలకు 9వేల 400ఇండ్లను మంజూరు చేయడం జరిగిందని, గృహలక్ష్మి పథకం లబ్ధి కోసం అవసరమైన వారు చేసుకోవాలని తెలిపారు. జిల్లాలోని తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాలు, జిల్లా కలెక్టరేట్ లో ప్రత్యేక గృహలక్ష్మి కౌంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని, అర్హత గల అభ్యర్థులు సకాలంలో దరఖాస్తు చేసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## ఈ పెట్రోల్ బంక్ చాలా డిఫరెంట్




**వరంగల్ వాయిస్, మల్హర్ :** ఆధునిక డిజిటల్ యుగంలో ప్రతి చిన్న లావాదేవీ ఫోన్ పే, గూగుల్ పే వంటి డిజిటల్ పేమెంట్ యాప్ ల సహాయంతో జరుగుతున్న విషయం తెలిసిందే. చాయ్ వాలా నుంచి కిరాణా షాపు వరకు ప్రతి ఒక్కరూ డిజిటల్ చెల్లింపులు ఆమోదిస్తున్నప్పటీకి మండలంలోని కొయ్యూరు ప్రధాన రహదారిపై గల ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ మాత్రం ఇందుకు పూర్తి విరుద్ధం. ఈ బంక్ లో ఇప్పటి వరకు ఒక్క డిజిటల్ లావాదేవీ కూడా జరగలేదంటే అతిశయోక్తి కాదు. ఈ బంక్ లో డిజిటల్ పేమెంట్ లు అక్సెప్ట్ చేయకపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాజాగా బంక్ యాజమాన్యం ఫోన్ పే నాట్ అవలబుల్ అంటూ బోర్డ్ పెట్టడం గమనార్హం.

## టీయూడబ్ల్యూజే (ఐజేయూ) మహాసభను విజయవంతం చేయాలి



**వరంగల్ వాయిస్, మరిపెడ :** ఈ నెల 13న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించే టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా మహాసభను విజయవంతం చేయాలని మరిపెడ ఐజేయూ జిల్లా ఉపాధ్యక్షుడు గంధసిరి రవి, మండల అధ్యక్షుడు అక్తర్ పాషా పిలుపునిచ్చారు. మంగళవారం మున్సిపల్ కేంద్రంలో ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 13న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ద్వితీయ మహాసభను ఏర్పాటు చేస్తున్నామని, ఈ మహాసభకు రాష్ట్ర సీనియర్ జర్నలిస్టులు, యూనియన్ నాయకులు హాజరుతున్నట్లు తెలిపారు. మరిపెడ మండలంలోని సంఘానికి సంబంధించిన ప్రతి జర్నలిస్టు ఈ మహాసభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సంపాదకుడు మహ్మద్ రియాజ్ పాషా, జర్నలిస్టులు వంకాయలపాటి తిరుమల రావు, జిన్నా లచ్చయ్య, చంద్రశేఖర్, బోడ నాగేందర్, మచ్చ రాజేష్, మాలోత్ తిరుపతి, బోడ శీను తదితరులు ఉన్నారు.

## డీఎంహెచ్ఓగా డాక్టర్ అంబరీష్ బాధ్యతల స్వీకరణ



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డా.అంబరీష్ జిల్లా కలెక్టర్ కె శశాంకను తన చాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి బాధ్యతలు చేపట్టారు. కార్యాలయ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలుపుతూ వైద్య ఆరోగ్యాధికారిని శాలువాతో సత్కరించారు.

# ఘనంగా జాతీయ అవయవదాన వారోత్సవాలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** మరణానంతరం అవయవ, నేత్ర, శరీర దానం చేయాలని, ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని ఎంజీఎం సూపరిండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. వరంగల్ లోని తెలంగాణ నేత్ర అవయవ, శరీర దాతలు అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అవయవదాన వారోత్సవాల ఫ్లెక్సీని సూపరిండెంట్ ఆవిష్కరించి, అసోసియేషన్ ప్రతినిధులను అభినందించారు. భారతదేశంలో ప్రతి సంవత్సరం జాతీయ అవయవదాన వారోత్సవాలు 6 ఆగస్టు నుంచి 13 వరకు నిర్వహింపబడుతున్నాయని, అందులో భాగంగా మూడు ఆగస్టున న్యూఢిల్లీలో జరిగిన 13వ జాతీయ అవయవ దాన దినోత్సవ సందర్భంగా మన తెలంగాణ రాష్ట్రం 2022 సంవత్సరానికి గాను అధిక సంఖ్యలో అవయవ దానాలు చేసిన సందర్భంగా మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. 190 అవయవ దానాలు చేయగా, 530 అవయవాలను చావు బతుకులో ఉన్న అభాగ్యులకు మార్పిడి చేయడంతో పాటు ట్రాన్స్ ప్లాంట్ చేశారని అన్నారు. ఈ క్రమంలో అవయవ దాన వారోత్సవాల సందర్భంగా




ప్రజలందరూ అవయవదానం, నేత్రదానం శరీర దానంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మరణానంతరం నేత్ర, అవయవ, శరీర దానాలు చేసి ప్రజలకు మహోపకారం చేద్దామని ఎంజీఎం సూపర్ డెండెంట్ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కొండ్రెడ్డి మల్లారెడ్డి, సలహాదారు ఆడెపు రాజేంద్రప్రసాద్, వారణాసి మోహన్ పాల్గొన్నారు.

# దళితుల అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

## చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాజీపేటలోని అంబేద్కర్ నగర్‌లో అంబేద్కర్ ఆశయ సాధన కోసం అనేక సంవత్సరాల నుంచి పనిచేస్తున్న అంబేద్కర్ సంఘం వారు కొన్ని నెలల క్రితం నుంచి అంబేద్కర్ భవన్ కోసం అడగడం జరిగింది. అందుకు గాను మంగళవారం ఇంజినీరింగ్ అధికారులను, తహసీల్దార్ ను తీసుకొచ్చి ఇక్కడ ఉన్నభూమిని పరిశీలించడం జరిగిందని ప్రభుత్వ చీఫ్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా దళితుల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేస్తుందన్నారు. అనేక కార్యక్రమాలు ప్రవేశపెట్టి వారి అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న సీఎం కేసీఆర్ కి కృతజ్ఞతలు తెలిపారు. యువకుల కోసం మహిళల కోసం శుభకార్యాల కోసం ఈ హాల్ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. వారు 300గజాలలో ఈ నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఉన్న స్థలంలో జీ ప్లస్ వన్ బిల్డింగ్ నిర్మాణాన్ని చేపడతామని తెలిపారు. మహిళల కోసం స్వయం ఉపాధి కోసం అనేక కార్యక్రమాలను గ్రౌండ్ ఫ్లోర్ లో చేపడతామన్నారు. మహిళల ఉపాధి కోసం కుట్టు మిషన్ కేంద్రం, పేపర్ బ్యాగుల తయారీ జూట్ బ్యాగుల తయారీ, ఇతర స్వయం ఉపాధి కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. యువకుల కోసం స్కిల్ డెవలప్ మెంట్, ఉద్యోగ ఉపాధి కోసం కార్యక్రమాలు చేపడతామని అన్నారు. మున్సిపాలిటీ వాళ్లకు కూడా ఈ డిజైన్ చేసి ఇస్తామని తెలిపారు. ఇంకా నిధులు గనుక ఉన్నట్లయితే జీ ప్లస్ వన్ నుంచి జీ ప్లస్ టూ కూడా ఏర్పాటు చేస్తామని అన్నారు. దళితుల కోసం దళిత బంధులో అవగాహన కార్యక్రమాలు పెట్టి యువకుల అభివృద్ధికి పాటుపడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# వరద బాధితులకు నిత్యావసర సరుకులు

## పంపిణీ చేసిన ఎమ్మెల్యే అరూరి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ పరిధిలోని జవహర్ నగర్ కాలనిలోని ముంపు ప్రాంత ప్రజలకు అరూరి గట్టుమల్లు మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ స్వయంగా ఇంటింటికి వెళ్లి బాధితులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల కష్ట సుఖలలో పాలుపంచుకుంటూ వారికీ ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పరంగా ఆదుకోవడమే కాకుండా అరూరి ఫౌండేషన్ ద్వారా తక్షణ సహాయం అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సిరంగి సునీల్, డివిజన్ ప్రెసిడెంట్ మణింద్రనాథ్, డివిజన్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గద్దర్ సంస్కరణ సభ విజయవంతం చేయండి



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** మండలంలోని ముల్కనూర్ గ్రామంలో ప్రజా గ్రంథాలయం ఆవరణంలో మంగళవారం భీమదేవరపల్లి మండల ఉద్యమకారుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రజా యుద్ధనౌక, విప్లవ ఉద్యమ సాహిత్య కారుడు గద్దర్ అకాల మరణం చెందిన సందర్భంగా కామ్రేడ్ గద్దర్ కు సంస్కరణ సభ భీమదేవరపల్లి మండలంలోని అంబేద్కర్ కూడలి వద్ద సోమవారం 14న చేయడం జరుగుతుందని తెలిపారు. కాబట్టి భీమదేవరపల్లి మండలంలోని ప్రజా సంఘ నాయకులు,అన్ని పార్టీల రాజకీయ నాయకులు, దళిత సంఘ నాయకులు, గద్దర్ వీరాభిమానులు, ఉపాధ్యాయ సంఘం నాయకులు, మహిళా సంఘం నాయకులు హాజరుకావాలని భీమదేవరపల్లి మండల ఉద్యమ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ డి.సారయ్య, మాడుగుల ప్రెస్ డాక్టర్ ఎద్దులపురం తిరుపతి, ముల్కనూర్ సర్పంచ్ కొమురయ్య, మాడుగుల అశోక్, మాట్ల వెంకటస్వామి మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు రేణిగుంట్ల భిక్షపతి, చెప్పాల ప్రకాష్, లాజరస్, మేకల కండె రమేష్, ఉపాధ్యాయ నాయకులు స్టాలిన్, నన్న బోయిన తిరుపతి, కుంకట దుర్గయ్య, గంగారపు రవి తదితరులు పాల్గొన్నారు.

# కాజీపేటని రైల్వే డివిజన్‌గా ప్రకటించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాజీపేట రైల్వేస్టేషన్‌ను ఆధునీకరించటమే కాకుండా కాజీపేట రైల్వే జంక్షన్‌ను రైల్వే డివిజన్‌గా ప్రకటించాలని ప్రజావేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునాహరి శేషు లేఖ ద్వారా ప్రధానమంత్రికి విజ్ఞప్తి చేశారు. అమృత్ భారత్ స్టేషన్ స్కీంలో భాగంగా కాజీపేట రైల్వే స్టేషన్‌ను రూ.24.5 కోట్లతో ఆధునికరీంచడానికి ప్రభుత్వం నిర్ణయించిందని, అలాగే ఇటీవలనే రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌కు ప్రధానమంత్రి భూమిపూజ చేయటాన్ని ఆహ్వానిస్తున్నామన్నారు. కానీ, ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ అయిన కాజీపేట రైల్వే జంక్షన్‌ను రైల్వే డివిజన్‌గా ప్రకటించడానికి భారత ప్రధాన మంత్రి చొరవ చూపాలని కోరారు. కాజీపేట రైల్వే జంక్షన్ డివిజన్‌గా ప్రకటించడం వలన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగటంతో పాటు వ్యాపారం, వాణిజ్యం పెద్ద ఎత్తున పెరిగి ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. కాజీపేట రైల్వే డివిజన్ సాధించేవరకు వివిధ రూపాలలో ఉద్యమం చేస్తామని తెలియజేశారు. రైల్వేలను విస్తరించడానికి రైల్వేలను ఆధునికరించటానికి, అభివృద్ధి చేయడానికి భారత ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్న ఈ సందర్భంలో కాజీపేట రైల్వే జంక్షన్‌ని డివిజన్‌గా ప్రకటించాల్సిన అవసరం ఉందన్నారు.

# గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోండి

## మున్సిపల్ కమిషనర్ రాజు



**వరంగల్ వాయిస్, మరిపెడ :** గృహలక్ష్మి పథకం క్రింద ఇంటి నిర్మాణం చేయదలచిన వారు దరఖాస్తులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో, మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాలని మున్సిపల్ కమిషనర్ ఏ.రాజు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రభుత్వ ఉత్తర్వు నెం.25ను జారీ చేసి ప్రారంభించిన గృహ లక్ష్మి పథకం క్రింద సొంత ఇంటి నిర్మాణం చేసుకునే వారికి ఆర్థిక సహాయం రూ.3 లక్షల మంజూరు కోసం పట్టణ ప్రజలు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం గృహలక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకోదలిచిన వారు మహిళలు/ వితంతవులు వారి పేరున గల స్థలానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ కాగితాలు, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆహార భద్రత కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా మొదలైన వివరాలతో మున్సిపల్ కార్యాలయం, అలాగే జిల్లా కలెక్టర్ కార్యాలయము యందు ఏర్పాటు చేసిన ప్రత్యేక గృహలక్ష్మి కౌంటర్ లో ఆగస్టు10 సాయంత్రం వరకు దరఖాస్తులు సమర్పించాలన్నారు.

# దరఖాస్తుల స్వీకరణను పరిశీలించిన చైర్ పర్సన్ సోద అనిత రామకృష్ణ



**వరంగల్ వాయిస్, పరకాల :** ప్రభుత్వ ఆదేశాల మేరకు గృహలక్ష్మి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పరకాల మున్సిపాలిటీ కార్యాలయంలో గృహలక్ష్మి దరఖాస్తుల కౌంటర్లను మున్సిపల్ చైర్ పర్సన్ సోద అనిత రామకృష్ణ, వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్ రెడ్డి, మున్సిపాలిటీ కమిషనర్ టి.శేషు పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ గారు అనిత మాట్లాడుతూ పరకాల పట్టణంలోని అర్హులైన లబ్ధిదారుల నుంచి గృహలక్ష్మీ పథకం దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. నేటి నుంచి 10వ తేదీ సాయంత్రం 5:00గంటల వరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, అలాగే పరకాల పట్టణంలో ఉన్న అన్ని కులాల లబ్ధిదారులందరూ కూడా సంబంధింత డాక్యుమెంట్లు జతపరిచి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. తప్పనిసరిగా ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంక్ అకౌంట్, స్థలానికి సంబంధించిన పేపర్స్, కులం సర్టిఫికెట్ పాతవి ఉన్నా కూడా దరఖాస్తుకు జిరాక్స్ లు జతపరిచి మున్సిపాలిటీలో ఇవ్వాలని అన్నారు. కౌన్సిలర్లు ఒంటేరు సారయ్య, ఏకు రాజు, మున్సిపాలిటీ సిబ్బంది సీనియర్ అసిస్టెంట్ గిరిబాబు, శ్రీను, కృష్ణంరాజు, శ్రీనివాస్, స్రవంతి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# అభివృద్ధిని చూసే బీఆర్ఎస్‌లోకి చేరికలు



**వరంగల్ వాయిస్, ఐనవోలు :** మండలంలోని పున్నేల్ గ్రామానికి చెందిన వివిధ పార్టీల నుంచి సుమారు 100మంది బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కండువా కప్పిన వారిలో కాంగ్రెస్ పార్టీ మాజీ ఉప సర్పంచ్ మమూనూరు నర్సయ్య, మామునూరు చేరాలు, అశోక్, సంజీవ, జిల్లా సురేందర్, జిల్లా బాబు(డీలర్), జిల్లా రమేష్, అన్నారం సారయ్య, ఇల్లందుల ప్రభాకర్, పాపయ్య, గాజుల పాపయ్య, కందిక మల్లేష్, గాజుల సరిత, ఇల్లందుల కళావతి, గాజుల వజ్రమ్మ, కట్టమ్మ తదితరులకు ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నానని అన్నారు. ప్రజా సంక్షేమమే ఎజెండాగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మున్సిపాలిటీ అభివృద్ధికి రూ. 25కోట్లతో నిధులు మంజూరైన సందర్భంగా తొర్రూరు బస్టాండ్ ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్, మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ పొనుగోటి సోమేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ మంగలపల్లి రామచంద్రయ్య మాట్లాడుతూ గత మార్చి 8న మహిళా దినోత్సవ సందర్భంగా రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కె తారక రామారావు తొర్రూరు పట్టణ అభివృద్ధి కోసం రూ.25కోట్లతో ప్రత్యేక నిధులు మంజూరు చేస్తామని చెప్పి నేడు మంజూరు ఆర్డర్ ఇచ్చినందుకు వారికి, రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్ నాయకత్వంలో పాలకుర్తి నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ జినుగా సురేందర్ రెడ్డి, కౌన్సిలర్లు ఎన్నమనేని శ్రీనివాసరావు, గుగులోత్ శంకర్, సీనియర్ నాయకులు దొంగరి శంకర్, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి కుర్ర శ్రీనివాస్, మండల గిరిజన సమన్వయ కమిటీ అధ్యక్షులు ధరావత్ జయసింగ్, బిజ్జాల అనిల్, కర్నే నాగరాజు, తూర్పాటి రవి, పేర్ల జంపా, ఎండీ జలీల్, గుండాల నరసయ్య, చలవాది సత్యనారాయణ, రాయిశెట్టి వెంకన్న, భూసాని ఉప్పలయ్య, బాలు నాయక్, కిన్నెర పాండు, రమేష్, స్వామి, యశోద, ఆశయ్య, శీను, మంగళంపల్లి వినయ్, దామోదర్ రెడ్డి, మంగళంపల్లి నాగరాజు, గుంజి రవి, రాజు, ముఖేష్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గద్దర్ సాంస్కృతిక పోరాటం మరువలేనిది

## చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాజీపేట జంక్షన్ లో ప్రజా యుద్ధనౌక గద్దర్ చిత్రపటానికి రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ పూలమాలవేసి ఘన నివాళులు అర్పించి, వారి మృతి పట్ల తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ మాట్లాడుతూ తెలంగాణ పాటకు ప్రపంచ ఖ్యాతి తెచ్చిన ప్రజా వాగ్గేయకారుడు, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన ఉద్యమంలో తన పాటద్వారా పల్లె పల్లెనా భావజాల వ్యాప్తి చేసిన గద్దర్ (గుమ్మడి విఠల్ రావు) మరణం తీవ్ర దిగ్భ్రాంతి గురి చేసిందన్నారు. తెలంగాణ కోసం తన ఆట పాటలతో ప్రజల్లో స్వరాష్ట్ర చైతన్యాన్ని రగిలించిన గద్దర్ ప్రజాయుద్ధనౌకగా ప్రజల హృదయాల్లో నిలిచారని తెలిపారు. ప్రజల కోసం తన జీవితాన్ని ప్రజలకే అంకితం చేసి, ప్రజల కోసమే బతికాడని, గద్దర్ మరణంతో యావత్ తెలంగాణ గొప్ప ప్రజా కవిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ కోసం గద్దర్ చేసిన సాంస్కృతిక పోరాటం మరువలేనిది అన్నారు. సాధారణ బుర్రకథ కళాకారుడిగా ప్రారంభమైన గద్దర్ కళాజీవితం, విప్లవ రాజకీయాలతో మమేకమై, అనంతర కాలంలో తెలంగాణ సాధన కోసం సాగిన ఉద్యమంలో సాంస్కృతిక పోరాటంలో ఉన్నతస్థాయికి చేరిందన్నారు. కవిగా గద్దర్ ప్రజా కళలకు, ఉద్యమాలకు చేసిన సేవలు మరుపురానివని, వారు లేని లోటు పూడ్చలేనిదని అన్నారు. ప్రజా కళాకారులకు కవులకు మరణం వుండదనీ, ప్రజాకళలు వర్ధిల్లినంతకాలం ఆయన పేరు అజరామరంగా నిలిచి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



**వరంగల్ వాయిస్, మడికొండ :** కాజీపేట మండలంలోని 45వ డివిజన్ కడిపికొండ గ్రామానికి చెందిన వహీదా, 46వ డివిజన్ మడికొండకు చెందిన సపురా హమీద్ లకు మంజూరైన షాదీ ముబారక్ చెక్కులను, 45వ డివిజన్ కడిపికొండ గ్రామానికి చెందిన వేముల సుగుణకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.3లక్షల చెక్కులను బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ మంగళవారం తన నివాసంలో లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదరికంతో బాధపడుతూ, అనారోగ్యాల బారిన పడుతున్న వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించటం ద్వారా ప్రభుత్వం భరోసాగా నిలుస్తుందన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేదింటి ఆడబిడ్డల కుటుంబాల్లో వెలుగులు నింపాలనే సంకల్పంతో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని, అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే సీఎం కేసీఆర్ ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 46వ డివిజన్ కార్పొరేటర్ మునిగాల సరోజన కరుణాకర్, పీఏసీఎస్ దర్గా సొసైటీ చైర్మన్ ఊకంటి వనంరెడ్డి, కాజీపేట మండల రైతుబంధు అధ్యక్షుడు కంకణాల సంపత్ రెడ్డి, 46వ డివిజన్ అధ్యక్షుడు బొల్లికొండ వినోద్ కుమార్, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ కేంద్ర బృందం పరిశీలన



**వరంగల్ వాయిస్, మరిపెడ :** స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ (ఎస్ఎసీజీ) కేంద్ర బృందం సభ్యులు మంగళవారం మరిపెడ మండలం వీరారం గ్రామ పంచాయతీలో పర్యటించి పారిశుధ్య పనులు పరిశీలించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ (ఎస్ఎసీజీ) కేంద్ర బృందం సభ్యులు గ్రామ పంచాయతీ లో స్థానిక అధికారులతో ప్రతీ ఇంటికి వెళ్లి వ్యక్తిగత మరుగుదొడ్డి, ఇంకుడు గుంత, చెత్త సేకరణ, మురుగు కాల్వతోపాటు వీధుల్లో పర్యటించి పారిశుధ్య పనులు గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ గుగులోతు అరుణా రాంబాబు, ఎంపీడీవో ధన్ సింగ్, స్థానిక సర్పంచ్ పద్మ హరి, ఎంపీటీసీ సభ్యులు జిక్కి నారాయణ, మునేష్, ఇంచార్జీ ఎంపీవో రామకృష్ణ, ఏపీవో మంగమ్మ, ఏపీఎం రాములు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు రమేష్, లెనిన్, రామోజీ, ఉమేష్, దశరథ్, నరేష్ పాల్గొన్నారు.

# తండ్రి మృతితో అనాథలైన ముగ్గురు పిల్లలు

## గాలివారిగూడెంలో విషాదం

**వరంగల్ వాయిస్, మరిపెడ :** మహబూబాద్ జిల్లా మరిపెడ మండలం గాలివారిగూడెం గ్రామంలో భవన నిర్మాణ రంగంలో పెయింటింగ్ కార్మికుడిగా పనిచేస్తున్న ఏడేల్లి ఉపేందర్ (30) ప్రమాదవశాత్తు జారిపడి సోమవారం రాత్రి మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన కథనం ప్రకారం ఉపేందర్ పెయింటింగ్ పని ముగించుకొని ఇంట్లో స్నానం చేద్దామని బాత్రూంలో కాలు జారిపడడంతో తలకు తీవ్రమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతుడికి ఇద్దరు అమ్మాయిలు, ఒక కుమారుడు వీరు చిన్నపిల్లలు. భార్య ఎడెల్లి ఉమారాణి గత రెండు సంవత్సరాల క్రితం మరిపెడ పీహెచ్ సీలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ వికటించి మృతి చెందింది. తండ్రి కూడా మృతి చెందడంతో ఆ ముగ్గురు పిల్లలు అనాథలుగా మిగిలారు.

### మృతుడి కుటుంబానికి పరామర్శ ..

మరిపెడ మండలంలోని గాలి వారి గూడెంలో ఆకస్మకంగా మృతి



చెందిన పెయింటింగ్ కార్మికుడు ఎడెల్లి ఉపేందర్ కుటుంబాన్ని మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు పరామర్శించారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. వారి వెంట బీఆర్ యస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు నారెడ్డి సుదర్శన్ రెడ్డి, మహిళ విభాగం నాయకురాలు నారెడ్డి కవితా రెడ్డి, స్థానిక సర్పంచ్ ఎడెల్లి రామయ్య (వెంకన్న), కుటుంబ సభ్యులు ఉన్నారు.

# ట్రైబల్ వెల్ఫేర్ గురుకులాల్లో మెస్ ఛార్జీలు పెంచాలి

## ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు అజ్మీరా వెంకట్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ట్రైబల్ వెల్ఫేర్ గురుకులాల్లో మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని, గురుకులాల్లో పేరుకుపోయిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆర్ సీఓ డీఎస్ వెంకన్నకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అజ్మీరా వెంకట్ మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ట్రైబల్ వెల్ఫేర్ గురుకులాల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయాలని హాస్టల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని అన్ని గురుకులాలకు రాష్ట్ర ప్రభుత్వం సొంత భవనాలు నిర్మాణం చేయాలని విద్యార్థులకు అనుగుణంగా బాత్రూమ్స్, తరగతి గదులు నిర్మించాలని, సకాలంలో నోట్ బుక్స్, పాఠ్య పుస్తకాలు అందించాలని వారు డిమాండ్ చేశారు. అంతేకాదు వర్షాకాలంలో సీజన్ వ్యాధుల వల్ల పిల్లలకు విష జ్వరాలు వచ్చే



ప్రమాదం ఉంటుందని, కాబట్టి దోమతెరలు అందించాలని కోరారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, అన్ని గురుకులాలలో ఏఎన్ఎం పోస్టులను భర్తీ చేయాలని, మెనూ చార్ట్ ప్రకారం పిల్లలకు పోషకాహారం అందించాలని డిమాండ్ చేశారు. బానోతు మోహన్, అజ్మీరా రవి, గుగులోతు మోతిలాల్ పాల్గొన్నారు.

# మూడున్నర కిలోల కణతి తొలగింపు

## క్లిష్టమైన సర్జరీ విజయవంతం

## శ్రీనివాస కిడ్నీ సెంటర్ డాక్టర్ రాంప్రసాద్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మహిళ కడుపులో ఉన్న మూడున్నర కిలోల కణతిని తొలగించి సర్జరీని విజయవంతం చేశామని హనుమకొండలోని శ్రీనివాస కిడ్నీ సెంటర్ డాక్టర్ రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. హనుమకొండ జులైవాడకు చెందిన కోరుట్ల స్వరూప కడుపులో మూడున్నర కిలోల కణతి ఏర్పడింది. ఈ కణతి తొలగింపు కోసం పలు కార్పొరేట్ హాస్పిటల్స్ చుట్టూ తిరిగిన ప్రయోజనం లేకపోవడంతో తమ ఆసుపత్రిని సంప్రదించినట్లు డాక్టర్ రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ కణతి కుడి కిడ్నీకి కాలేయానికి పెద్ద పేగులకు మధ్య ఉండడంతో సర్జరీ క్లిష్టతరంగా మారిందని పేర్కొన్నారు. గత నెల 31న మూడు గంటలకు పైగా సర్జరీ నిర్వహించి కణతిని తొలగించినట్లు తెలిపారు. మూడు లక్షల ఖర్చు అయ్యే ఆపరేషన్ ను తమ ఆసుపత్రిలో కేవలం 70 వేలకే పూర్తిచేసి ఈ రోజు పేషెంట్ ను డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు. సర్జరీలో తనతో పాటు డాక్టర్ ఉపేందర్, డాక్టర్ ఆకాష్, డాక్టర్ సామ్రాట్ పాల్గొన్నారని యూరాలజిస్ట్ డాక్టర్ రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.



# గృహలక్ష్మి పథకంపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

## బీజేపీ నేత కుందూరు మహేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తామని గొప్పలు చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వానికి పేదల కల్పతరువు గృహ లక్ష్మి పథకంపై చిత్తశుద్ధి లేదని బీజేపీ జిల్లా నాయకుడు కుందూరు మహేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని విమర్శించారు. వైన్ షాపు టెండర్లకు 15 రోజుల సమయం ఇచ్చి దరఖాస్తులు కోరుతుండగా గృహలక్ష్మి పథకానికి మాత్రం మూడు రోజులు మాత్రమే సమయం ఇచ్చి పేదలకు అన్యాయం చేస్తుందని ఆయన వర్ధన్నపేట లో విలేకరుల సమావేశంలో ప్రభుత్వాన్ని ఎండ కట్టారు. ఈ నెల ఆఖరి వరకు సమయాన్ని పొడిగించి పేదలకు, అర్హులకు ప్రభుత్వ గృహలక్ష్మి పథకాన్ని అందే విధంగా పనిచేయాలని డిమాండ్ చేశారు.

# గృహలక్ష్మీ దరఖాస్తుల స్వీకరణ



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని వరంగల్ లోని కాశీబుగ్గ సర్కిల్ ఆఫీసులో దరఖాస్తులదారుల నుంచి తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపాలిటీ సిబ్బంది స్వీకరించారు.

# ప్రతీ ఒక్కరూ నేత్రాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

## వాసవి క్లబ్స్ అంతర్జాతీయ అధ్యక్షురాలు పాలకుర్తి గాయత్రి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కళ్ళ కలక, కంటి జబ్బులు అధికం అవుతున్న ప్రస్తుత తరుణంలో ప్రతీ ఒక్కరూ కంటి పరీక్షలు చేసుకొని వైద్యుల సూచనల మేరకు తమ నేత్రాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని వాసవిక్లబ్స్ అంతర్జాతీయ అధ్యక్షురాలు పాలకుర్తి గాయత్రి అన్నారు. వరంగల్ పిన్నావారి వీధిలోని వాసవిక్లబ్ భవన్ లో వాసవిక్లబ్ వనితా వరంగల్ వారి ఐఎన్.పీ గుడ్ విల్ విజిట్ కార్యక్రమంలో భాగంగా శరత్ మాక్స్ విజన్ ఐ హాస్పిటల్ వారి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా గాయత్రి మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో వాసవి క్లబ్ ముందంజలో ఉంటుందన్నారు. వనితా క్లబ్ వరంగల్ వారి గుడ్ విల్ విజిట్ కార్యక్రమాల్లో భాగంగా వాసవి మాత దేవాలయంలో వాటర్ ప్యూరిఫై మిషన్ అందచేశామని, మామునూరు ప్రభుత్వ పాఠశాలలో జాతిపిత గాంధీ విగ్రహావిష్కరణ, అనంతరం క్లబ్ భవనంలో జరిగిన సమావేశంలో 50మంది వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్లు ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గవర్నర్ రవ్వ గీత, ఐ క్యాంప్ ఆర్గనైజర్ దివ్వెల పూర్ణచందర్, శ్రీరాం శైలజ, క్లబ్ అధ్యక్షురాలు జూలూరు శిరీష, రమ్య, శ్రీదేవి, నాగరాణి, హైమావతి, కళావతి, వరలక్ష్మీ, శ్రీలేఖ, శరత్ మాక్స్ విజన్ ఐ హాస్పిటల్ డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# నిరుపేద రైతులకు లేగదూడల పంపిణీ



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మండలంలోని జీకే తండాలో 10మంది గిరిజన రైతులకు కోడె దూడలను తెలంగాణ గోశాల రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ తెలంగాణ గోశాల ఆధ్వర్యంలో రాష్ట్రంలోని నిరుపేద రైతులను గుర్తించి పాడి గేదెలతో పాటు పశువులకు కావలసిన పశుగ్రాసం కూడా అందించడం జరుగుతుందని ఆయన అన్నారు. గోమయంతో తయారుచేసిన రాఖీలు సోదరీమణులందరూ వాడి పర్యావరణం రక్షించే విధానంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బానోత్ అచ్చమ్మ, సొమ్లా నాయక్, గోశాల నిర్వాహకులు సంతోష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, దేవరుప్పుల :** మండలంలోని ఉమ్మడి ధర్మపురం నూతన గ్రామ పంచాయతీకి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మూధ(బబ్బి) రమేష్ తండ్రి మూధ షాక్రు నాయక్ (70) అనారోగ్యంతో మరణించగా మూధ షాక్రు చిత్రపటానికి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సతీమణి, ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్ ఎర్రబెల్లి ఉషా దయాకర్‌రావు నివాళులర్పించి, ఆయన కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్, జిల్లా నాయకుడు పల్ల సుందర్ రాంరెడ్డి, నియోజక వర్గ యూత్ అధ్యక్షుడు గడ్డం రాజు, మండల ప్రధాన కార్యదర్శి చింత రవి, మండల అధికార ప్రతినిధి సుడిగెల హనుమంత్, బీఆర్ఎస్ నాయకులు కుతాటి నర్సింహులు, లాలు, చింత సోమయ్య, వేంకటేశ్వర్లు, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

# వరద బాధితులకు ధరణీ సాయి చేయూత



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరదల వల్ల ముంపు ప్రాంతాల ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని, వారి కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసి చేయూత అందించిన ధరణీ సాయి సభ్యుల సేవా నిరతిని వరంగల్ ట్రాఫిక్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ పిట్టల వెంకన్న కొనియాడారు. వరంగల్ నగరంలోని ధరణీసాయి సేవాసంఘ్ వారి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం రామన్నపేట, గిర్మాజిపేట, సీఆర్ నగర్ ముంపు ప్రాంతాల్లో నిరాశ్రయులయిన బాధిత కుటుంబాలకు 100మందికి సీఐ వెంకన్న చేతుల మీదుగా నిత్యావసర సరుకులు, బియ్యం, కొత్త చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సీఐ వెంకన్న మాట్లాడుతూ ఎల్లప్పుడు అన్నదానం, గోసేవ, గోపూజ సేవా కార్యక్రమాల్లో ముందుండే ధరణీ సభ్యులు ముంపు బాధిత కుటుంబాలకు ఆసరాగా నిలవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఎస్ఎస్ సభ్యులు జి.సుధాకర్, ఆర్.హరిప్రసాద్, దివ్వెల పూర్ణ, సాయిమురళి, శంకర్, అశోక్, సతీష్, ఎ.రవీందర్, బుచ్చన్న, కుషాల్ చంద్, మూర్తి, పూర్ణ, కళ్యాణ్, దేవేందర్, మాధవి, దీపిక, ధరణీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# యువ నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ వారి ఆధ్వర్యంలో వరంగల్ జిల్లాకు చెందిన కొత్తకొండ సారంగపాణి–సుజాత దంపతుల కుమారుడు యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షుడు కొత్తకొండ అరుణ్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా వరంగల్ జిల్లా ఆటోనగర్ లో ఉన్న లూయిస్ ఆదర్శ బ్లైండ్ స్కూల్ లో 231వ రోజు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన ఈక్విటాస్ బ్యాంక్ మేనేజర్ పొట్ల శ్రీరాము, ఈక్విటాస్ బ్యాంకు సిబ్బంది, కన్నె రాజు, బొట్టు కమలాకర్, బిటుకూరి యాకయ్య, కోలా రాజేష్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజ్జెల సుమన్, అలువాల పృథ్వీ, ఉప్పరపల్లి రాజ్ కుమార్, మునిగాల రాంప్రసాద్, సృజన, పాలకుర్తి విష్ణు, లీగల్ అడ్వైజర్ రాచకట్ల కృష్ణ, ఊరికి రవికుమార్, చెలిమల్ల అశోక్ కుమార్, తూనం రాము, సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ వైనాల రమేష్, మోడెం రాజశేఖర్ గౌడ్, నాగవెల్లి కార్తీక్ పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే నన్నపునేనిని కలిసిన దివ్యాంగులు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నవ తెలంగాణ దివ్యాంగుల సంఘం వరంగల్ జిల్లా కమిటీ మంగళవారం శివనగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దివ్యాంగుల పెన్షన్ మూడు వేల నుంచి నాలుగు వేలకు పెంచుతున్న తెలంగాణ సర్కారు, ముఖ్యమంత్రి కేసీఆర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నవ తెలంగాణ రాష్ట్ర వికలాంగుల ఫోరుమ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ అజీమ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బండి చక్రపాణి, అంబటి రాజేందర్, కోశాధికారి గై సతీష్, అబ్దుల్ షబ్బీర్, నీలం రాజు, సాధిక్ పాల్గొన్నారు.

# లీకేజీ పనుల్లో జాప్యం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ కాశిబుగ్గలోని తిలక్ రోడ్డులో మున్సిపాలిటీ పైపు లైను లీకేజీ అయ్యి గత జూన్ నెల10 నుంచి నీరు వృధాగా పోతుంది. అయినా కూడా మునిసిపాలిటీ సిబ్బంది పట్టించుకోవడం లేదు. అక్కడే మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజ్ అవ్వడం వల్ల 2నెలలు క్రితం సీసీ రోడ్డు పగలగొట్టి ఇప్పటివరకు పని పూర్తి చెయ్యలేదు. ఒక బీజేపీ కార్యకర్త ఇంటి ముందు ఈ సమస్య ఉందని మేయర్ కు, మున్సిపాలిటీ సిబ్బందికి ఎన్నిసార్లు విన్నవించుకున్నా కావాలని మరమ్మత్తు చేయకుండా సమస్యను పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారని, కనీసం ఇంటి లోపలికి వెళ్లకుండా దారి లేకుండా చేశారని బాధితుడు కోమాకుల నాగరాజు బీజేపీ రాష్ట్ర నాయకుడు వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు కి విన్నవించుకోవడం జరిగింది. విషయం తెలిసిన వెంటనే ప్రదీప్ రావు పైపు లీకేజీ అయినా స్థలం వద్దకు వెళ్లి, సంబంధిత అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. ఎందుకు ఇన్ని రోజులుగా ఈ సమస్యను ఇలాగే వదిలేశారని, అధికారులను నిలదీశారు. బీజేపీ నాయకులు, కార్యకర్తల ఇళ్లకు సంబంధించిన సమస్యలు అయితే పట్టించుకోకూడదని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పాలకులు కొత్తగా ఏమైనా జీవో తీసుకొచ్చారా అని ప్రశ్నించారు. వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించాలనీ అధికారులకు సూచించారు.

# రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించేదెప్పుడు..

## బీజేపీ నేత మొలుగూరి భిక్షపతి



**వరంగల్ వాయిస్, పరకాల :** భారీ వర్షాలకు దెబ్బతిన రోడ్లను తిరిగి నిర్మించేది ఎప్పుడు అని పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి పరకాల ఎమ్మెల్యే ధర్మారెడ్డని ప్రశ్నించారు. పరకాల నియోజకవర్గంలోని నడికూడ మండలంలోని పలు గ్రామాలలో నడికూడ మండల అధ్యక్షుడు గోగుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి భారీ వర్షాలు దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు. ముస్త్యాలపెల్లి, చౌటుప్పర్తి మధ్యనున్న కల్వర్టు కూలిపోవడంతో ముస్త్యాలపెల్లి, చౌటుపర్తి గ్రామాల మధ్య రాకపోకలు ఆగిపోయాయని అన్నారు. నార్లపూర్ వెంకటేశ్వర్లపల్లి మధ్య బ్రిడ్జి రెండు చోట్ల కూలిపోవడంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయని అన్నారు. వ్యవసాయ కూలీలకు, అత్యవసరంగా ఆరోగ్య రీత్యా పరకాల రావలసిన పేషెంట్లకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. భారీ వర్షాలతో కూలిపోయిన బ్రిడ్జిని పరకాల ఎమ్మెల్యే ధర్మారెడ్డి పరిశీలించినందుకు వెళ్లి నార్లపూర్ గ్రామంలోని ఆగి వర్షాలు తగ్గడంతోనే ఒక్కరోజులోనే బ్రిడ్జి పనులు పూర్తి చేస్తానని హామీ ఇచ్చిన కాంట్రాక్టర్ ధర్మారెడ్డి మీ హామీలు ఏమాయ్యని ప్రశ్నించారు. అభివృద్ధి ప్రదాత అని చెప్పుకునే ఎమ్మెల్యే వీటికి కాంట్రాక్టు బిల్లు రావని తెలిసి పనులు ప్రారంభిస్త లేదని ఎద్దేవా చేశారు. దామెర మండలంలో పలు గ్రామాలకు మంచి రోడ్లు ఉన్న వాటికి కాంట్రాక్టు పని కోసం రూ.61 కోట్లు మంజూరు చేయించుకొని పనులు చేస్తున్నారని, ఆ కాంట్రాక్టు పనుల డబ్బులతోనే రాబోయే ఎన్నికల్లో ఖర్చు పెడతావా అని ప్రశ్నించాడు. ప్రజలు నరేంద్ర మోడీ వైపు మొగ్గు చూపుతున్నారని, రాబోయే రోజుల్లో డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తుందన్నారు. పరకాల ఎమ్మెల్యే ఓటుకు పదివేలు ఇచ్చిన పరకాల నియోజకవర్గ ప్రజలు ఓడించుడు ఖాయమని అన్నారు. పరకాల గడ్డ బీజేపీ అడ్డ అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, పరకాల కౌన్సిలర్ ఆర్పీ జయంతిలాల్, బీజేపీ నాయకులు మంద టునిట్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# బాలీవుడ్‌కు నో ..

అల వైకుంఠపురంతో రికార్డు సృష్టించి.. పుష్పతో ఏకంగా పాన్ ఇండియా స్థాయిలో రికార్డులు కొల్లగొట్టి తిరుగులేని స్టార్‌గా ఎదిగాడు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్. ఇప్పుడు ఆయన సినిమా కోసం యావత్ సినీ లవర్స్ ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. రెండేళ్ల కిందట విడుదలైన పుష్ప సినిమా బాక్సాఫీస్ దగ్గర సృష్టించిన సంచలనాలు అంతా ఇంతా కాదు. ఎలాంటి ప్రమోషన్‌లు లేకుండానే హిందీ బెల్ట్‌పై వంద కోట్ల బొమ్మతో నార్త్ ఆడియెన్స్‌తో జైజైలు కొట్టించుకున్నాడు. ప్రస్తుతం బన్నీ 'పుష్ప-2'తో బిజీగా ఉన్నాడు. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. ఈ సినిమా తర్వాత బన్నీ, త్రివిక్రమ్‌తో చేతులు కలుపుతున్నాడు. వచ్చే ఏడాది ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్లే చాన్స్ ఉంది. ఇక ఇదిలా ఉంటే తాజాగా బన్నీ ఓ బాలీవుడ్ దర్శకుడికి నో చెప్పినట్లు తెలుస్తుంది. నాలుగేళ్ల కిందట వచ్చిన ఉరి: ది సర్జికల్ స్ట్రయిక్ సినిమాతో దేశమంతటిని తనవైపు తిప్పుకునేలా చేశాడు దర్శకుడు ఆదిత్య ధార్. ఉరి సినిమాను తెరకెక్కించిన విధానానని సినీ లవర్స్ ఫిదా అయ్యారు. ఆయన టేకింగ్, విజన్‌కు హర్షధ్వానాలు వెల్లువెత్తాయి. అలాంటి దర్శకుడి నుంచి ఇప్పటి వరకు మరో సినిమా రాలేదు. కారణం ఏంటో తెలియదు కానీ విక్కీ ఈ సినిమా నుంచి తప్పుకున్నాడు. ఆ తర్వాత రణ్‌వీర్ సింగ్‌ను సంప్రదించగా.. ఆయన నుంచి ఎలాంటి రెస్పాన్స్ రాలేదు. కాగా తాజాగా ఆ దర్శకుడు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌ను సంప్రదించినట్లు తెలుస్తుంది. బన్నీకి కథ బాగా నచ్చిందట. కానీ సినిమా చేయడానికి వెనకా ముందు ఆలోచిస్తున్నాడట. పుష్ప సినిమాలో రగ్గడ్ లుక్‌లో చూసిన జనాలకు.. అశ్వత్థామ అనే ఇతిహాసం కథలో తన పాత్ర రిజిస్టర్ అవుతుందా అనే మిలియన్ల డాలర్ల ప్రశ్నతో నో చెప్పాడని టాక్.



# అలియా భట్ హాలీవుడ్ ఎంట్రీ



బాలీవుడ్ లో స్టార్ నటిగా గుర్తింపు తెచ్చుకుంది అలియా భట్. వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. 'ఆర్ఆర్ఆర్' చిత్రం ద్వారా అలియా తెలుగు ప్రేక్షకులకూ దగ్గరైంది. ఈ చిత్రంలో సీత పాత్రలో నటించి మెప్పించింది. ఇప్పుడు హాలీవుడ్లో తన నటనను నిరూపించుకోవడానికి సిద్ధంగా ఉంది. స్పై యాక్షన్ థ్రిల్లర్ 'హార్ట్ ఆఫ్ స్టోన్' చిత్రం ద్వారా హాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తోంది. ఈ సినిమాలో మొదటిసారి ప్రతినాయక ఛాయలున్న పాత్రలో కనిపించబోతోంది. ఈ సినిమా ఆగస్టు 11న విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది. ప్రమోషన్స్‌లో భాగంగా అలియా భట్ తన సహ నటులు గాల్ గడోట్, జేమీ డోర్నన్ తో కలిసి ఓ ఇంటర్వ్యూలో పాల్గొంది. ఈ సందర్భంగా హాలీవుడ్ నటి గాల్‌కు తెలుగు నేర్పించే ప్రయత్నం చేసింది. 'అందరికీ నమస్కారం.. మీకు నా ముద్దులు' అని పలకమంది. ఆ పదాలను గాల్ అతికష్టంమీద పలికే ప్రయత్నం చేసింది. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. టామ్ హార్పర్ తెరకెక్కించిన ఈ చిత్రం ప్రముఖ ఓటీటీ ఎ÷-లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ ద్వారా ఆగస్టు 11న విడుదలవుతోంది. ఇంగ్లీష్, తెలుగుతోపాటు ఇతర భారతీయ భాషల్లోనూ నెట్ ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది.

## ఖుషి ప్రమోషన్స్‌లో..



విజయ్ దేవరకొండ, సమంత జంటగా శివ నిర్వాణ దర్శకత్వంలో రూపొందిన 'ఖుషి' చిత్రం సెప్టెంబర్ 1న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెల్సిందే. సినిమా విడుదల విషయంలో ఎలాంటి డౌట్ లేదు.. కానీ సినిమా విడుదల సమయంలో ప్రమోషన్స్ కి సమంత హాజరు అయ్యేనా లేదా అనేది గత కొన్ని రోజులుగా సస్పెన్స్ గా ఉంది. ఎందుకంటే సమంత ఏడాది పాటు సినిమాలకు బ్రేక్ తీసుకుంటున్నట్లుగా ప్రకటించింది. అంతే కాకుండా విదేశాల్లో సమంత చికిత్స నిమిత్తం వెళ్లబోతుందనే వార్తలు వస్తున్నాయి. 'ఖుషి' సినిమా ప్రమోషన్ కార్యక్రమాల్లో సమంత పాల్గొనే అవకాశాలు లేవని అంతా భావించారు. కానీ తాజాగా బాలి నుంచి చెన్నైకి సమంత వచ్చేసింది. ఇటీవల తన తల్లిదండ్రుల వద్ద మరియు చిన్మయి ఇంటి వద్ద సందడి చేసింది. అంతే కాకుండా తన సోషల్ మీడియా అకౌంట్స్ లో ఖుషి సినిమా పోస్టర్ ను షేర్ చేసి అందరి దృష్టిని ఆకర్షించింది. షూటింగ్ లకు హాజరు అవ్వకున్నా కూడా సినిమా ప్రమోషన్ కార్యక్రమాల్లో అయినా సమంత పాల్గొనే అవకాశాలు ఉన్నాయి అనిపిస్తుంది.

# షూటింగ్ ఆగలేదు

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హరీష్ శంకర్ దర్శకత్వంలో మొదలైన ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా ఊహించిన విధంగా మధ్యలో చాలాసార్లు నిలిచిపోయింది. ఇక మొత్తానికి హరీష్ శంకర్ చాలా హడావిడిగానే సినిమా షూటింగ్ స్టార్ట్ చేసినప్పటికీ కూడా మళ్లీ పవన్ కళ్యాణ్ ఎప్పటిలానే రాజకీయలలో బిజీ అయిపోయి సినిమాను కాస్త పక్కన పెట్టాల్సి వచ్చింది. ఇక పవన్ కేవలం ఇప్పుడు ఓజి సినిమా పైన ఎక్కువగా ఫోకస్ చేస్తూ ఉన్నాడు అని కూడా కథనాలు రావడంతో ఉస్తాద్ భగత్ సింగ్ కూడా ఆగిపోతుందేమో అని అనేక రకాల గాసెప్స్ కూడా వచ్చాయి. అయితే ఈ సినిమాపై ఇలాంటి కథనాలు వైరల్ అవుతున్న సమయంలోనే మైత్రి మూవీ మేకర్స్ నిర్మాత నవీన్ యెర్నేని క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు. ఉస్తాద్ భగత్ సింగ్ అసలు ఏమాత్రం ఆగిపోలేదు అనే త్వరలోనే ఇది సరైన ట్రాక్‌లో ముందుకు సాగుతుంది అని ఒక మాటలోనే తేల్చేశారు. ఇక ఈ యాక్షన్ త్రిల్లింగ్ సినిమా తప్పకుండా సంక్రాంతికి తీసుకువచ్చే విధంగా ప్రయత్నాలు చేస్తామని చెప్పారు. అంతేకాకుండా ఒకవేళ అప్పుడు కుదరకపోతే సినిమాను వీలైనంత త్వరగా సమ్మర్లో అయినా విడుదల చేస్తామని నిర్మాత ఒక వివరణ అయితే ఇచ్చారు. మొత్తానికి ఉస్తాద్ భగత్ సింగ్ ఫ్యాన్స్ కు అయితే గుడ్ న్యూస్ వచ్చినట్లు అయింది. ఇక ఈ సినిమాలో పొలిటికల్ సెటైర్స్ చాలా పవర్ఫుల్‌గా ఉండబోతున్నాయి అని ఇటీవల హరీష్ శంకర్ కూడా ఒక హింట్ అయితే ఇచ్చాడు. ఇక హరీష్ శంకర్ కూడా పవన్ కళ్యాణ్ తో సినిమాను తొందరగా పూర్తి చేయాలని అనుకుంటున్నాడు.వారాహి యాత్రకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సినిమా షూటింగ్ పూర్తి చేద్దామని ముందు ఒక కీలకమైన షెడ్యూల్ కోసం మాత్రం పది రోజుల డేట్స్ ఇస్తే చాలు అని హరీష్ శంకర్ చాలా సింపుల్ ప్లాన్ గురించి చెప్పాడట. దీంతో పవన్ కళ్యాణ్ కూడా అందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లుగా తెలుస్తోంది. ఇక ఈ సినిమాను 2024 ఎన్నికల కంటే ముందుగానే విడుదల చేయాలి అని అనుకుంటున్నారు.



# చిరు వ్యాపారులను కాపాడండి

## ఆర్‌పీఎఫ్ డీజీపీకి ఎంపీ కవిత వినతి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** రైల్వేస్టేషన్ ఆధారంగా జీవనం సాగిస్తున్న చిరువ్యాపారులను కాపాడాలని మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యురాలు మాలోత్ కవిత కొత్త ఢిల్లీలోని ఆర్‌పీఎఫ్ డీజీపీ మనోజ్ యాదవ్‌ను ప్రత్యేకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. రైల్వేస్టేషన్‌లతోపాటు పరిసరాల్లో చిరువ్యాపారాలు చేసుకునే వారిని రైల్వే పోలీసులు ఇబ్బంది పెడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని వెల్లడించారు. మానవతాదృక్పదంతో వారి వ్యాపారాలకు అడ్డంకులు సృష్టించవద్దని కోరారు. మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని మహబూబాబాద్, డోర్నకల్, కేసముద్రం, నెక్కొండ తదితర రైల్వేస్టేషన్‌ల పరిధిలో నిరుపేదలు, ప్రధానంగా మహిళలు, గిరిజనులు చిరు వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారని వెల్లడించారు.

# సమాచార హక్కు వికాస సమితి పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి చేతుల మీదుగా మంగళవారం సమాచార హక్కు వికాస సమితి పోస్టర్ ఆవిష్కరించారు. సమాచార హక్కు వికాస సమితి జిల్లా అధ్యక్షుడు సాదుల పూర్ణచందర్ ఆధ్వర్యంలో కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు. అనంతరం కాశిబుగ్గ పరిధిలోని రేషన్ డీలర్ రాజు చేతుల మీదుగా పోస్టర్ ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ మండల అధ్యక్షుడు చిదిరాల ముఖేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పద్మశాలీలు ఏకం కావాలి



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** ధర్మసాగర్ మండల కేంద్రంలోని శివుని గుడి ఆవరణలో మండల పద్మశాలి కమిటీ, ధర్మసాగర్ గ్రామ కమిటీ, యువజన సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఇనుగాల మల్లేశం అధ్యక్షతన ధర్మసాగర్ మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు గుర్రపు ప్రసాద్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈనెల 13న కోరుట్లలో జరిగే పద్మశాలి రాజకీయ యుద్ధభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఇందుకు సంబంధించిన గోడపత్రికలను హనుమకొండ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు డాక్టర్ చందా మల్లయ్య ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గుడిమల్ల కృష్ణారావు, జిల్లా యూత్ కోకన్వీనర్ అజయ్, మండల యూత్ అధ్యక్షుడు గుర్రపు వినేష్ వారి మిత్రబృందం పాల్గొన్నారు.

# యువత జీవితాల్లో వెలుగులు నింపుతాం

## బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బీఎస్పీ అధికారంలోకి రాగానే రాష్ట్రంలోని లక్షలాదిమంది విద్యార్థులు, యువత జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తామని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. హన్మకొండలోని డా.నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో మంగళవారం జరిగిన బహుజన విద్యార్థి గర్జనకు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. తదనంతరం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులు, యువత కోసం పార్టీ ఎన్నికల డిక్లరేషన్‌ను ప్రకటించారు.

# ప్రపంచ చరిత్రలోనే ప్రత్యేక అస్తిత్వ ఉద్యమం తెలంగాణ ఉద్యమం



**వరంగల్ వాయిస్, కేయూ :** "ప్రపంచ చరిత్రలోనే ప్రత్యేక అస్తిత్వ ఉద్యమం తెలంగాణ ఉద్యమం" అని హైదరాబాద్, ఉస్మానియా యూనివర్సిటీ, విశ్రాంత చరిత్ర విభాగ ఆచార్యులు ఆచార్య అడపా సత్యనారాయణ అన్నారు. మంగళవారం కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య తాటికొండ రమేష్ అధ్యక్షతన, విశ్వవిద్యాలయ కామర్స్ కళాశాల సెమినార్ హాల్ లో నిర్వహించిన 11వ డాక్టర్ కె.జయశంకర్ స్మారక ఉపన్యాస కార్యక్రమంలో బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులను ఉద్దేశించి "ది తెలంగాణ ప్రాబ్లం: హిస్టారిక్ పర్స్పెక్టివ్ (%ఉష్ట్రవ ్ఒవశ్రీఖఅస్త్రుఖఅు ్రాతీశీఎశ్రీవఎ : ్ఎఅర్శీతీఅఎ ్రావతీంజూవఓ్ఒఅజవ%)" అనే అంశం స్మారక ఉపన్యాసం చేశారు. గొప్ప మార్గదర్శకుడు, ఆశావాది, దూరదృష్టి కాల వ్యక్తి డాక్టర్ కొత్తపల్లి జయశంకర్ అని కొనియాడారు. తన చిన్న తనం నుంచే తెలంగాణకు జరుగుతున్నా అన్యాయం, ఇతరుల ఆధిపత్యాన్ని వ్యతిరేకించిన వ్యక్తి డాక్టర్ జయశంకర్ అన్నారు. తాను కన్నా తెలంగాణ డ్రీమ్ 2014లో సాక్షాత్కరించిందని, అది చూడలేక పోయారని వాపోయారు, గత, ప్రస్తుత, భవిష్యత్ లను అంచనా వేసి తెలంగాణ ప్రజల్లో సాధికారతను నింపిన వ్యక్తి డాక్టర్ జయశంకర్ అన్నారు. 1952ముల్కి ఉద్యమంలో యువ పోరాట యోధుడిగా ముందు వరసలో ఉన్నారని అన్నారు. ఆచార్య పర్మాజి, ఆచార్య శ్రీధరస్వామి, ఆచార్య రావడా సత్యనారాయణ లాంటి వారితో కలిసి పనిచేశారని గుర్తు చేశారు. ప్రపంచంలో ఎన్నో ఉద్యమాలు వచ్చాయి కానీ, తెలంగాణ ఉద్యమానికి ఒక ప్రత్యక స్థానం ఉందని తెలిపారు. 500సంవత్సరాల ముస్లిం రాజుల పాలనలో కూడా ప్రాంతీయ అస్తిత్వం నిలకడగా కొనసాగిందన్నారు. 1935లోనే 'హైదరాబాద్ ఫర్ హైదరాబాదీ' అనే నినాదం ఉందని గుర్తుచేశారు. 1930వ దశకంలోనే ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి బీజం పడిందన్నారు. 1969 ఉద్యమం ఎంప్లాయిమెంట్, బడ్జెట్, ఇరిగేషన్ పైనే విద్యార్థులు, యువత ఉద్యమించారని అన్నారు. తెలంగాణ ఉద్యమం అన్ని అస్థిత్వాలలో ఒక సార్వజనీయత కలిగి ఉందన్నారు. తెలంగాణా శాసన మండలి డిప్యూటీ చైర్మన్, డాక్టర్ కే జయశంకర్ మెమోరియల్ ట్రస్ట్ సెక్రటరీ డాక్టర్ బండా ప్రకాష్ మాట్లాడుతూ ట్రస్ట్ స్థాపన, అందుకు సహకరించిన పెద్దలు, చేపట్టిన కార్యక్రమాలు వివరించారు. ఇప్పటి వరకు 10స్మారక ఉపన్యాసాలు నిర్వహించినట్టు, ఇందులో దేశంలోని ప్రముఖ వ్యక్తులను పిలిచి వివిధ సామాజిక, ప్రస్తుత అంశాలపై ఉపన్యాసాలు చేయించినట్టు, 11వ స్మారక ఉపన్యాసం నేడు నిర్వహిస్తునట్టు తెలిపారు. మాజీ ఉపకులపతి, డాక్టర్ కె.జయశంకర్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ ఆచార్య ఎన్ లింగ మూర్తి మాట్లాడుతూ ఆచార్య జయశంకర్ సేవలను కొనియాడారు. మాజీ రిజిస్ట్రార్, డాక్టర్ కె.జయశంకర్ మెమోరియల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ ఆచార్య ఎ.శంకరయ్య, డాక్టర్ కె.జయశంకర్ తన అనుభవాలను పంచుకున్నారు. సభ అధ్యక్షత వహించిన వైస్ ఛాన్సలర్ ఆచార్య తాటికొండ రమేష్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలోని హ్యూమానిటీస్ బిల్డింగ్ డాక్టర్ కె.జయశంకర్ భవనంగా నామకరణం చేస్తామని ప్రకటించారు. డాక్టర్ జయశంకర్ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తామని తెలిపారు. అన్ని స్మారక ఉపన్యాసాలను పుస్తక రూపంలో తీసుకోస్తామని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య టి శ్రీనివాస్ వందన సమర్పణ చేశారు. ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ సభ వేదిక పైకి అతిథులను ఆహ్వానించారు. డాక్టర్ జయశంకర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు అర్పించారు. బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు, విశ్రాంత ఉద్యోగులు, డాక్టర్ జయశంకర్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

# గృహలక్ష్మికి మూడు రోజులే..

## ఆశావాహుల్లో అయోమయం
## గడువు పెంచాలంటూ వినతులు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** గృహలక్ష్మి పథకం కింద లబ్ధిపొందాలనుకునేవారు ఈనెల 10 లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం డెడ్‌లైన్ విధించడంతో ఆశావాహుల్లో అయోమయ పరిస్థితి నెలకొంది. ఎంతో కాలంగా ఊరిస్తున్న పథకానికి ప్రభుత్వం కేవలం మూడు రోజుల గడువు మాత్రమే విధించడంపై పలువరు మండిపడుతున్నారు. ఈ పథకం కింద ఇళ్లులేని నిరుపేదలకు ఇల్లు కట్టుకోవటానికి ప్రభుత్వం రూ.3 లక్షల ఆర్థికసాయం చేయనుంది. ఇందుకుగాను కలెక్టరేట్, మునిసిపల్ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. మంగళవారం ప్రారంభమైన ఈ పథకానికి గురువారంలోగా దరఖాస్తు చేసుకోవాలంటూ ప్రభుత్వం నిబంధన పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీఎస్ శాంతికుమారి సోమవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఆదేశాలు జారీ చేయడంతో హడావిడిగా ఏర్పాట్లు పూర్తి చేశారు. పలువురు అధికారులకు దీనిపై అవగాహన లేకపోవడంతో చాలా కేంద్రాల్లో ఆశావాహులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అర్హులు తమ దరఖాస్తు ఫారంతో పాటు ఖాళీ స్థలం రిజిస్ట్రేషన్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, ఆహార భద్రతా కార్డు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్ జత చేయాల్సి ఉంటుంది. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకోసం మీ సేవా కేంద్రంలో దరఖాస్తు చేయాల్సి ఉంది. అవి వచ్చేందుకు కనీసం వారం రోజుల సమయం పడుతుది. అలాంటిది ఇప్పటిప్పుడు గృహలక్ష్మి పథకానికి అర్హులు దరఖాస్తు చేయాలంటూ నిబంధన విధించడం హాస్యాస్పదంగా ఉందంటున్నారు. ఎక్కువ మంది దరఖాస్తు చేసుకోకుండా అడ్డుకునేందుకే ప్రభుత్వం ఈ విధంగా మూడు రోజుల నిబంధన విదించిందంటున్నారు.

### గడువు పొడిగించాలి..:

**సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి**

పేదల ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన గృహలక్ష్మి పథకం గడువు పొడిగించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. మంగళవారం కాజీపేటలోని ఆర్ఎన్ నగర్, ఏఆర్ఆర్ నగర్ కాలనీలను సీపీఐ నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు పొందేందుకు వారం రోజుల సమయం పడుతున్నందున గడువును మరో 15 రోజులు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దళిత బంధు, బీజీ బంధు, మైనారిటీ బందులో లబ్ధి దారుల ఎంపికను ఎమ్మెల్యేల కనుసన్నల్లో కాకుండా గ్రామ సభల ద్వారా పూర్తి చేయాలని వెంకట్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, నాయకులు మునిగాల భిక్షపతి, మాలోతు శంకర్, బొట్టు భిక్షపతి, రాసమల్ల దీనా, బి.రాజమణి, ఎస్.స్వరూప, కుమార్, చందర్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

### ఆంక్షలతో అర్హులకు అన్యాయం..:



**నడిగోటి నరేష్**

గృహలక్ష్మి పథకం దరఖాస్తు గడువును పెంచాలని బహుజన్ సమాజ్ పార్టీ హుస్నాబాద్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు నడిగోటి నరేష్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వకుండా ఇప్పటికే పలువురికి అన్యాయం చేసిందని ఆరోపించారు. రేషన్ కార్డు లేకపోవడంతో పలువురు నిరుపేదలు గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునే అర్హత కోల్పోయారన్నారు. ప్రభుత్వం ఆంక్షలతో అర్హులకు అన్యాయం జరుగుతోందన్నారు.

### 31 వరకు పొడిగించాలి..:



**బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు**

సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకోవాలనుకున్న పేదలు గృహలక్ష్మీ పథకం కింద దరఖాస్తు చేసుకోవడానికి ఆగస్టు 10 వ తేదీ గడువుగా నిర్ణయించడం పేదలను వంచించడమేనని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ఆరోపించారు. ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా దరఖాస్తులకు గడువును ఆగస్టు 31 వరకు పొడిగించాలని డిమాండ్ చేశారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com